ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

సోమవారం 21 ఏప్రిల్ 2025

గ్రంథాలయానికి పక్కా భవనం కలేనా..?

- స్థలం కేటాయించినా నిధుల విడుదలలో జాప్యం
- ఇబ్బందులు పడుతున్న పాఠకులు

8



కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ అడ్లూరి

పెగడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పెగడపల్లి మండలంలోని ఆరవెల్లిలో నూతనంగా మంజూరు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విప్ లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం విక్రయించేందుకు గ్రామంలో కొనుగోలు కేంద్రం లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారన్నారు. గ్రామంలో కొనుగోలు కేంద్రం మంజూరు చేయించాలని చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలన్న కోరిక మేరకు త్వరలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. రైతులు కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని లక్ష్మణ్ కుమార్ రైతులకు సూచించారు. అంతకుముందు గ్రామంలోని నాయకురాలు నాగమ్మ, సత్యనారాయణస్వామి ఆలయాలను లక్ష్మణ్ కుమార్ సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, పార్టీ నాయకులు ఒరుగల శ్రీనివాస్, సంధి మల్లారెడ్డి, కడారి తిరుపతి, ఆకుల విష్ణు, శోభారాణి, సత్తయ్య, అంజయ్య, కిషన్, పూసాల తిరుపతి, సత్తిరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాయికల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో జగిత్యాలలోని శ్రీ వేంకటేశ్వర ఆర్థో, జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు టి.విజయ రెడ్డి 100మంది రోగులను పరీక్షించి అవసరమైనవారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, మహేశ్వర్‌రావు, ఏనుగు ముత్యం రెడ్డి, గుర్రం మహేందర్ గౌడ్, మంగళారపు లక్ష్మీనారాయణ, వైద్యులు జలంధర్, ప్రసాద్, రాజేశం పాల్గొన్నారు.



జిల్లాకు చేరుకున్న పుస్తకాలు

పాఠ్య పుస్తకాలు వస్తున్నాయి..

- జిల్లాకు కావాల్సినవి 3,86,406
- గోదాంకు చేరుకున్న 44,190 పుస్తకాలు
- బడులు తెరిచే నాటికి పూర్తిగా అందుబాటులోకి
- కాగితం మందం తగ్గింపు

జగిత్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థుల చేతికి పాఠ్యపుస్తకాలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తీసుకుంటున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా గత యేడాది కాంగ్రెస్ సర్కారు అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసింది. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే వరకు కనీస మౌలిక వసతుల కల్పన ఏర్పాటులో భాగంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ వంటి మరమ్మతులు చేపట్టనున్నారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు సకాలంలో అందించేందుకు ఇప్పటికే పిల్లల దుస్తుల కొలతలు తీసుకున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, వర్క్‌బుక్కులు పాఠశాలల ప్రారంభం నాటికి పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. జగిత్యాల జిల్లాకు ఎంతమేర అవసరమవుతాయో ఇప్పటికే విద్యాశాఖాధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించారు. వాటిని దశల వారీగా రాష్ట్ర అధికారులు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మొదటివిడత పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి.

బరువు తగ్గించి..

పాఠ్య పుస్తకాల బరువు మోత విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. పుస్తకాల బరువు మోతను నివారించేందుకు పుస్తకం ముద్రించే కాగితం మందం తగ్గించారు. దీంతో బరువు తగ్గి పిల్లల ఇబ్బందులు తీరనున్నాయి. జిల్లా వ్యాప్తంగా అవసరమయ్యే పుస్తకాల సంఖ్యలో వంద శాతం వరకు పుస్తకాలు బడులు తెరిచే నాటికి అందుబాటులో ఉంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, మరాఠీ భాషల్లో వీటిని రూపొందించారు.

జిల్లాలో కావాల్సినవి ఇలా...

జిల్లా వ్యాప్తంగా యూడైస్ ఆధారంగా ఒక్కో విద్యార్థికి తరగతిని బట్టి 5నుంచి 11 పుస్తకాలు అవసరమవుతాయి. 2023-24 యూడైస్ ప్రకారం జిల్లాలో 853 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 85,368 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ సుమారు 3,86,406 పాఠ్య పుస్తకాలు అవసరమవుతాయన్న అంచనాతో జిల్లా విద్యా శాఖాధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇందులో ఒకటో తరగతి పుస్తకాలు 12,180, రెండో తరగతి 12,220, మూడో తరగతి 16,360, నాలుగోతరగతి 16,870, ఐదో తరగతి 28,180 పుస్తకాలు అవసరమున్నాయి. ఆరోతరగతి 46,460 పుస్తకాలు, ఏడోతరగతి 48,000, ఎనిమిదోతరగతి 58,570, తొమ్మిదోతరగతి 71,940, పదోతరగతి 75,880 పుస్తకాలు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఇప్పటివరకు జిల్లాకు 44,190 పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. ఇంకా 3,42,216 పుస్తకాలు రావాల్సి ఉన్నాయి.

ధరూర్ క్యాంపు గోదాంలో నిల్వ

జిల్లా కేంద్రానికి చేరుకుంటున్న పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, వర్క్ బుక్కులను ధరూర్ క్యాంపులో గల ప్రత్యేక గోదాంలో విద్యాశాఖ అధికారులు నిల్వ చేస్తున్నారు. ఇందుకు ఆరుగురు సభ్యులుగా ప్రత్యేక బృందం అధికారులకు బాధ్యతలు అప్పగించారు. డిస్ట్రిక్ట్ టెక్స్ బుక్స్ మేనేజర్‌గా ద్రోణంరాజు వెంకట రామకృష్ణ వ్యవహరిస్తుండగా ఐదుగురు సీఆర్‌పీలు, ఒక సహాయ అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జిల్లా కేంద్రానికి పుస్తకాలు పూర్తిగా చేరుకున్న తర్వాత వాటిని మండల విద్యావనరుల కేంద్రానికి పంపించనున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు...

మిగతా 8లో

నోట్ బుక్కులు సైతం...

ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన నోట్ బుక్కులు సైతం ప్రభుత్వం అందించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా పలు నోట్ బుక్కులు సైతం జిల్లాకు చేరుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 3,82,321 నోట్ బుక్కులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ప్రాథమిక పాఠశాలల పిల్లలకు అవసరమైన వర్క్‌బుక్స్ సైతం పంపిణీ చేయనున్నారు. 6వ, 7వ తరగతుల విద్యార్థులకు ఆరు చొప్పున, 8వ తరగతి విద్యార్థులకు 8 నోటు బుక్కులు, 9వ, 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి 14 చొప్పున నోట్ బుక్కులు అందజేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, టీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడానికి అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి.



జగిత్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత



సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లత

మల్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల నేపథ్యంలో అకాలవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మల్యాల మండలంలోని నూకపల్లి, రామన్నపేట, మద్దుట్ల, ముత్యం పేట, మల్యాలలో గల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టి త్వరితగతిన మిల్లులకు తరలించాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఐకేపీ ఏపీఎం జీసీ రాజయ్య, డిప్యూటి తహసీల్దార్ నీత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి తదితరులు ఉన్నారు.

●**కొడిమ్యాల:** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నాణ్యత ప్రమాలు ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత ఆదేశించారు. ఆదివారం సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి, రాంసాగర్ గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ తూకం వేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే తరలించాలన్నారు.

తూకం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కొనుగోలు నిర్వాహకులను ఆదేశించారు. వారి వెంట ఆర్డీవో మధుసూధన్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ కురుణాకర్, ఇన్‌చార్జి ఏపీఎం వి.పద్మ, సీసీ మంగ, కొనుగోలు కమిటీ సభ్యులు, రైతులు ఉన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సేవా భారతి ఆధ్వర్యంలో జగిత్యాలలో వాల్మీకి ఆవాసంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వాల్మీకి ఆవాసంలో ప్రతి యేటా వేసవి సెలవుల ఆరంభంలో ఈ వ్రతాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. 200 కుటుంబాలు సామూహికంగా ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ లోకేష్ జీ మాట్లాడుతూ ప్రపంచంలోనే గొప్పదైన సనాతన ధర్మాన్ని, కుటుంబ విలువలను కాపాడుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వాల్మీకి ఆవాస వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. అనంతరం సామూహిక భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్‌లు అడువాల జ్యోతిలక్ష్మణ్, గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్‌లు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖులు దర్శించుకొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆవాస అధ్యక్షుడు జిడిగె పురుషోత్తం, డాక్టర్ భీమనాతి శంకర్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అన్ని వర్గాల అభివృద్ధి ధ్యేయంగా సంక్షేమ పథకాల అమలు చేస్తోందని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్ కాంగ్రెస్ కార్యాలయంలో మున్సిపల్, ఆయా గ్రామాలు, మండలాల స్థానిక కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు పొందేందుకు, మహాత్మ గాంధీ, అంబేద్కర్ ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకవెళ్లేందుకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను కాంగ్రెస్ గ్రామ గ్రామాన నిర్వహిస్తుందన్నారు. స్థానిక సంస్థలకు పాలక వర్గాలు లేకపోవడంతో స్థానిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేయాలన్నారు. గతంలో జగిత్యాలలో ప్రతిరోజు తాగునీరు అందించామని, రూ.200లకే ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చామని గుర్తు చేశారు. రేషన్‌కార్డు ఒక హక్కుగా భావించి ప్రభుత్వం అర్హులందరికి అందజేస్తుందన్నారు. సన్నబియ్యం పంపిణీతో నిరుపేద వర్గాలు సంతోషంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో దశాబ్ధకాలం పాటు బీఆర్ఎస్ సర్కారు కేవలం రాజకీయ ప్రయోజనాలపై దృష్టి సారించిందని విమర్శించారు.

వచ్చే మున్సిపల్, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని జీవన్‌రెడ్డి సూచించారు. కాంట్రాక్టు పనుల్లో స్థానిక కార్యకర్తలకు అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరడం జరిగిందన్నారు. జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తూ సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ సెక్రెటరీ బండ శంకర్, జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ జీఆర్ దేశాయి, నాయకులు గాజెంగి నందయ్య, కొత్త మోహన్, జిల్లా గంగాధర్, గాజుల రాజేందర్, కంటాల శ్రీనివాస్, కొత్తూరు గంగాధర్, నెహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



కథలాపూర్‌లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కథలాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. భూషణరావుపేట, కథలాపూర్, తాండ్ర్యాల, బొమ్మెన చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సామూహిక భోజనాలు పెట్టారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు గసికంటి సామ్యూల్, మిట్టపల్లి కిషన్, నేతనేల్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

●**పెగడపల్లి:** పెగడపల్లి మండలంలోని నార్సింహనిపేటలోని వాయిస్ ఆఫ్ లవ్ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈస్టర్ వేడుకల గురించి వాయిస్ ఆఫ్ లవ్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు మల్లేశం ఎజ్రా ఉద్బోధించారు. కార్యక్రమంలో రజిత ప్రార్థన రేఖా, క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

●**బీర్‌పూర్:** బీర్‌పూర్ మండలంలోని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. బీర్‌పూర్, ఇందిరానగర్, నర్సింహులపల్లి, కొల్వాయి, మంగేళ గ్రామాల్లో గల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసుక్రీస్తు ఆదివారం ఉదయం సమాధిలో నుంచి లేచాడని గుర్తు చేస్తూ చర్చి ఫాదర్లు ప్రత్యేక ఉపదేశాలను అందించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్లు పౌలు, జోషఫ్, రవి, ఇస్సాక్ క్రైస్తవ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

‘క్రీడలతో మానసికోల్లాసం’

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి అన్నారు. గడిచిన 19ఏళ్లుగా వివిధ హోదాల్లో ఉన్న అధికారులంతా టీమ్‌లుగా ఏర్పడి స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు ఆడడం అభినందనీయం అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో టీచర్స్ క్రికెట్ లీగ్(టీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను పర్యవేక్షించారు.

ఈసందర్భంగా జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక ధృడత్వంతో పాటు స్నేహభావం వెల్లివిరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ బోగ రమేష్, మేనేజర్ బోయిన సురేష్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్, నాలుగు టీంల కెప్టెన్‌లు అయిల రఘుపతి, రాచమల్ల మహేష్, పూటూరి హరీష్, తుల సంజీవ్, సభ్యులు గంగారెడ్డి, బొమ్మకంటి శ్రీనివాస్, రవి, భాస్కర్, కృష్ణారెడ్డి, గంగాధర్, జీవన్ తదితరులున్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం లక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణం వైభవంగా జరిగింది. దేవాయలంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అర్చకులు చక్రపాణి మధవాచార్యులు ప్రత్యేక వేదకపై శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాస్ స్వామి వారి కళ్యాణంను జరిపారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అన్న ప్రదానంను స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోంతుల శ్యామల-తుక్కారం, మాజీ ఎంపీటీసీ పోనకంటి వెంకట్, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్, గ్రామ అభివృద్ధి కమిటి సభ్యులు సల్కం నర్సయ్య, దోమకొండ చిన్న రాజన్న, జోగదనంజయ్, రాంగిరి శ్యాంకుమార్, చింతకుంట శ్రీనివాస్, చిన్నయ్య, సంజీవ్, నాయకులు మామిడి సురుష్ రెడ్డి, బలురి కాశిరెడ్డి, భాస్కర్ రెడ్డి, అర్చకులు దివాకర చార్యులు, శ్రీధరాచార్యులు, నవీనా చార్యులు, బాను చార్యులు, రామాచార్యులు, అన్వేష్ చార్యులులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

రాయికల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ దేవాలయంలో పుట్ట ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో విగ్రహ దాత సాయ గౌడ్-రాధ, అధ్యక్షుడు మరిపెల్లి లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యక్షులు కోటగిరి రాజేశం గౌడ్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ఏర్పాటు

మల్యాల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని తాటిపల్లి పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటు అయింది. ఇటీవల అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగ్గా అధ్యక్షుడిగా కస్తూరి లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం కార్యవర్గంను ఎన్నుకోగా పదవీ బాధ్యతలు చేపట్టారు. గౌరవ అధ్యక్షుడిగా ఎనుగందుల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా మంచాల లక్ష్మన్, ప్రధాన కార్యదర్శిగా బాలే గంగస్వామి, కోశాధికారిగా పెంట గణేశ్, సహాయ కార్యదర్శులుగా గుండేటి రమేశ్, బుదారపు విజయ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా దాసరి నరేశ్, కొండబత్తిని శివప్రసాద్ ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య, పూర్వ అధ్యక్షులు దాసరి మల్లేశం, బింగి వేణుతో పాటు బొమ్మకంటి గంగాధర్, పెంట సుధాకర్, బుదారపు గంగమల్లు, మహేంధర్, జానకయ్య, సత్తయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దొంగల బీభత్సం

- కోళ్లమద్దిలో తాళం వేసిన ఇంట్లో చోరీ
- 5 తులాల బంగారం, 100 తులాల వెండి, రూ. లక్ష నగదు అపహరణ

గంభీరావుపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కోళ్ళమద్దిలో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇంట్లో చొరబడి భారీ ఎత్తున బంగారం, వెండి, నగదును ఎత్తుకెళ్లారు. కోళ్ళమద్దిలోని లింబయ్య తన భార్య శాంతవ్వ ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి లింబయ్య కుటుంబం 10 రోజులుగా ఆసుపత్రులు తిరుగుతున్నారు. ఇదేక్రమంలో శనివారం రాత్రి దొంగలు లింబయ్య ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. 3తులాల బంగారు పుస్తెల తాడు, తులం చైన్, తులం కమ్మలు, 70 తులాల వెండి కడియాలు, 30 తులాల పట్ట గొలుసులు, లక్ష నగదును దొంగలు ఎత్తుకెళ్ళినట్టు బాదితులు తెలిపారు. స్థానిక ఎస్ఐ ప్రేమానందం సిబ్బందితో వెళ్లిదొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు.

వడ్ల లోడ్ ట్రాక్టర్ బోల్తా..

శంకరపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకాయగూడెం శివారులోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం వడ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన ఓరైతు వడ్లను ట్రాక్టర్‌తో మానకొండూర్ శివారులోని ఓ సీడ్‌ప్లాంట్‌కు తరలిస్తున్నాడు. ఈక్రమంలో వంకాయగూడెం చేరుకోగానే టైర్ పంచర్ కావడంతో ఒక్కసారిగా ట్రాక్టర్ రోడ్డున పక్కనపడిపోయింది. ఆ సమయంలో అటుగా ఎవరు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

గుడుంబా పట్టివేత

రామగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్‌లో గుడుంబా అమ్మకాలు చేపడుతున్న మహిళను పోలీసులు ఆదివారంరాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన కోటగడ్డల రమాదేవి ఇంటివద్ద గుడుంబా విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి పట్టుకొని మూడులీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని మహిళ పై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పావులు కదిపితే ప్రత్యర్థులు చిత్తే

- చదరంగంలో రాణిస్తున్న క్రీడాకారులు
- జాతీయ స్థాయిలో ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని నిర్ణయించుకొని ముందుకుపోతే ఏ రంగంలోనైనా విజయాలు వరిస్తాయి. పదేళ్లకే జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి తమకంటే మెరుగైన రేటింగ్ ఉన్న క్రీడాకారులపై విజయాలు సాధిస్తున్నారు జిల్లాకు చెందిన చదరంగ క్రీడాకారులు. కరీంనగర్‌కు చెందిన ఇరుకుల్ల శ్లోకాయుక్తా, గంగిరెడ్డి శ్రీహంసిని, లిఖిత్ మాణిక్యరావు, ఐ కాశవేన సుప్రీత్ జాతీయ స్థాయి పోటీల్లో, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఫలితంగా వీరు ఫీడే రేటింగ్‌తోపాటు పలు అవార్డులను సొంతం చేసుకున్నారు.

ఎనిమిదేళ్ల నుంచే పోటీల్లో పాల్గొంటూ..



జిల్లా కేంద్రంలోని కృష్ణా నగర్‌కు చెందిన ఇరుకుల్ల శ్లోకాయుక్తి ఎనిమిది సంవత్సరాల వయస్సు నుంచే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటోంది. అండర్-14, అండర్- 17 ఎస్జీఎఫ్, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలను సాధించింది. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో జరిగిన 68వ జాతీయ స్థాయి అండర్-19 చదరంగ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. హిమాచల్ ప్రదేశ్‌లో జరిగి న 65వ జాతీయ స్థాయి అండర్-14 చదరంగ పోటీ ల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహ రిం చింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతోంది. అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదగాలనేదే తన లక్ష్యమని శ్లోకాయుక్తి చెబుతోంది.

జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించడమే లక్ష్యంగా..



జిల్లా కేంద్రానికి శ్రీ హంసిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. కరీంనగర్, హైదరాబాద్, హనుమకొండ, రంగారెడ్డి, నిజామా బాద్ జిల్లాల్లో జరిగిన ఎస్‌జీఎఫ్, అసోసియేషన్, ఓపెన్, సీఎం కప్ చదరంగ పోటీల్లో పాల్గొన్నది. ఇంతవరకు 13 రాష్ట్రస్థాయి, ఒక జాతీయస్థాయి చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభచాటి పతకాలను సొంతం చేసుకుంది. 2023లో హనుమకొండలో జరిగిన ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి యంగెస్ట్ గర్ల్ అవార్డును సొంతం చేసు కుంది. 2024 సెప్టెంబరులో కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో జరిగిన 37వ జాతీయస్థాయి అండర్-7 బాలికల చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఈ రాష్ట్రానికి పత కం సాధించడమే తన ధ్యేయమని శ్రీహంసిని తెలిపింది.

ఫిడే రేటింగ్ పోటీల్లో ప్రతిభ




కరీంనగర్‌కు చెందిన లిఖిత్ మాణిక్యరావు చిన్ననాటి నుంచే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్నాడు. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్ తదితర ప్రాం తాల్లో జరిగిన ఎస్‌జీఎఫ్, అసోసియేషన్, ఓపెన్ ఏడు రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. 2024లో హైదరాబాద్‌లో జరిగిన 37 జాతీయ అండర్-11 బాలబాలికల రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొని 57 పాయింట్లు సాధించాడు. హైదరాబాద్‌లోనే జరిగిన మొదటి అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొని మంచి రేటింగ్ సాధించాడు. 2023లో మహారాష్ట్ర లోని పూణేలో జరిగిన అఖిల భారత ఓపెన్ ఫిడే రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొని ఉత్తమ రేటింగ్ సాధించాడు. అంతర్జాతీయ చదరంగ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని లిఖిత్ మాణిక్యరావు అంటున్నాడు.

రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం



కరీంనగర్‌కు చెందిన కాశవేన సుప్రీత్ ఆరు సంవత్సరాలుగా చదరంగంలో శిక్షణ పొందుతున్నాడు. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్ నగర్, ఆదిలాబాద్, తదితర జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్, ఓపెన్ 13 టోర్నమెంట్లలో పాల్గొని ప్రతిభ చాటాడు. 2024లో మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్-17 చదరంగ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతి నిధ్యం వహించాడు. తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరులో 2023 డిసెంబరులో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-14 చదరంగ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచాడు. 2023లో కరీంనగర్ వైశ్య భవన్‌లో జరిగిన అఖిల భారత ఫిడే రేటింగ్ చదరంగ పోటీల్లో పాల్గొన్నాడు. ప్రపంచ చదరంగ చాంపియన్ గుఖేష్ తనకు ఆదర్శ మని కాశవేన సుప్రీత్ అంటున్నాడు.



న్యాయం చేయాలని..

బాధిత కుటుంబం ధర్నా



కరీంనగర్ అల్కాపురి కాలనీలో ధర్నా చేస్తున్న బాధితులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్ తహసీల్దార్‌కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూఉద్యోగి కొయ్యడ లాస్య, ఆమె భర్త రమేష్ తమ డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని వారి ఇంటి ఎదుట ఆదివారం బాధితులు ధర్నా చేశారు.

బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లికి చెందిన భైరి చిరంజీవి కుటుంబానికి ఉన్న వ్యవసాయభూమి, ఇల్లు గౌరవెల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురైంది. ఆ భూమికి ప్రభుత్వం పరిహారం కింద రూ.60లక్షలు అందజేసింది. డిప్యూటీ తహసీల్దార్ కొయ్యడ లాస్య, ఆమె భర్త రమేష్ సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగాంశివార్లలోని సర్వే నంబర్ 505, 507, 508లో తొమ్మిది ఎకరాల 16గుంట భూమి తమ పేరిట ఉందన్నారు. దానిని విక్రయిస్తామని భైరి చిరంజీవి, ఆయన బావ శ్రీనివాస్‌కు చెప్పారు. దీంతో చిరంజీవికి ప్రభుత్వం అందజేసిన డబ్బులు రూ.60లక్షలతో లాస్య, రమేష్‌కు చెందిన భూమిని కొనుగోలు ఒప్పందం శ్రీనివాస్ పేరిటచేశాడు. డబ్బులు మొత్తం ముట్టజెప్పినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేయడంతో బాధితులు కొద్దిరోజుల కిందట నిల దీశారు. దీంతో ఆ భూమిపై కోర్టులో విచారణ జరుగుతోందని చెప్పారు. కోర్టుకేసులో ఉన్న భూమిని మమ్మల్ని నమ్మించి విక్రయించారని బాధితులు ఆరోపించారు. తాము ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని అడిగితే బెదిరింపులకు పాల్పడు తున్నారని బాధితులు వాపోయారు. ఈ విషయంపై కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రెవెన్యూఉద్యోగి లాస్యతోపాటు ఆమె భర్తపై కేసు నమోదైనట్టు బాధిత కుటుంబానికి చెందిన చొప్పరి శ్రీనివాస్ తెలిపారు. ఉద్యోగం పోతుందని డబ్బులు తిరిగి చెల్లిస్తామని చెప్పిన రమేష్ తనకు చెక్కు ఇచ్చారని, ఆ చెక్కు కూడా రెండుసార్లు బౌన్స్ అయిందని తెలిపారు. అప్పటి నుంచి లాస్య, రమేష్ దంపతులకు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. దీంతో ఆదివారం కరీంనగర్ అలకాపురి కాలనీలోని లాస్య ఇంటి వద్ద నిరసనకు దిగామన్నారు. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి ఆందోళనను విరమింపచేశారు. తమకు అన్యాయం చేసి, మోసానికి పాల్పడిన లాస్య, ఆమె భర్త రమేష్‌పై చట్టపర మైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితులు కోరారు.

జేఎన్టీయూలో రిక్రూట్‌మెంట్ పరీక్షలు



జేఎన్టీయూలో ఫీల్డ్ అసిస్టెంట్ అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఉదయం ఫీల్డ్ అసిస్టెంట్, మధ్యాహ్నం రికార్డు అసిస్టెంట్ పోస్టులకు పరీక్షలు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగాలకు ఫీల్డ్ అసిస్టెంట్‌కు జరిగిన పరీక్షలో 100 మందికిగాను 64 మంది హాజరు కాగ 36 మంది గైర్హాజరైయ్యారు. మధ్యాహ్నం రికార్డు అసిస్టెంట్ పరీక్షలకు 100మందికి గాను 67మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరిఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

కారు ఢీకొని బాలుడు మృతి



శివరాజ్‌కుమార్(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గంగానగర్‌లో ఆదివారం కారు ఢీకొని పులిపాక శివరాజ్‌కుమార్(3) మృతిచెందాడు. బాలుడు ఆడుకుంటుండగా ఇంటిపక్కన ఉండేవ్యక్తి గమనించడకుండా కారు నడపడంతో బాలుడికి తగిలి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. కారు నడిపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ ఎస్ఐ భూమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టిన మజ్లిస్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టిన బడా చోర్ మజ్లిస్ అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దారుసలాంలో వక్ఫ్ ఆస్తులు కాజేసిన బడా చోర్ నాయకులతో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభఏర్పాటు చేయించారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒక్కటేనన్నారు. మూడు పార్టీలు ముస్లిం ఓట్లు దండుకుని వారిని ఆదుకోకుండా వక్ఫ్ ఆస్తులను దోచుకు తింటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా9లక్షల ఎకరాల వక్ఫ్‌భూముల ద్వారా 10లక్షలకోట్లకు పైగా ఆస్తులున్నా ఏ పేదముస్లింలకు లాభం చేశారో చెప్పా లని డిమాండ్ చేశారు. అంబేద్కర్ వారసులం మేమే నని, రాజ్యాంగ బద్దంగా మోదీప్రభుత్వం పని చేస్తుందన్నారు. హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో ఇప్పటివరకు ఒక్కఅంబేద్కర్ విగ్రహంలేదని, పేద ముస్లింలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో వక్ఫ్ సవరణ చట్టం అమలు చేస్తున్నట్లు వివరించారు.

అకాలవర్షాలు, వడగండ్లవానలతో వేలాది ఎకరాల్లో పంటదెబ్బతిని రైతులంతా అల్లాడుతుంటే ఆదుకోవాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన పేరుతో విదేశాలకు వెళ్లడమే మిటని ప్రశ్నించారు. వక్ఫ్ ఆస్తులను దోచుకున్న బడాచోర్లంతా కలిసి బీజేపీపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబేద్కర్ పెట్టిన భిక్షవల్లే ప్రధాని కాగలిగానని పార్లమెంట్‌లో ప్రకటించిన మహానేత నరేంద్ర మోదీయేనన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో దళిత, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన గొప్ప పార్టీ బీజేపీ అన్నారు. అంబేద్కర్ పేరును ఉచ్చరించే అర్హత కూడా ఒవైసీకి లేదన్నారు. వక్ఫ్ ఆస్తులపై యేటా 12 వేల కోట్ల రూపాయలకు పైగా ఆదాయం వస్తుంటే ఆ సొమ్మునంతా దిగమింగుతోంది మజ్లిస్ కాదా అని ప్రశ్నించారు. ఒక్క తమిళనాడులోనే 2వేలకోట్ల విలువైన వక్ఫ్‌ఆస్తులను ఆక్రమించుకుంది నిజంకాదా అన్నారు. రాముని గురించి ప్రశ్నించే వారికి వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలపై నిలదీసే దమ్ముందా అని ప్రశ్నించారు. ఒవైసీ కుటుంబంతోపాటు మజ్లిస్ నాయకులు, సోకాల్డ్ వక్ఫ్‌బోర్డు సభ్యులంతా వక్ఫ్ ఆస్తులను దోచుకుని ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వ్యా పారసంస్థలు నిర్మించి కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. వక్ఫ్‌భూముల్లో ఒక్క గజం అయినా పేదముస్లింలకు ఇచ్చారా అన్నారు. మేం వాస్తవాలు మాట్లాడుతుంటే వక్ఫ్‌ఆస్తుల్లో హిందువుల జోక్యమా అంటూ మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాను ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వక్ఫ్ ఆస్తులపై విచారణ జరిపించే దమ్ముందా అని ప్రశ్నించారు. ఎన్ని భూములు ఆక్రమణకు గురయ్యాయి, ఒవైసీ కుటుంబం ఎంత దోచుకుంది, వక్ఫ్ ఆస్తులపై ఎంత ఆదాయం వస్తోంది, పేదల సంక్షేమానికి ఎంత ఖర్చు చేశారనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మాజీ ఎంపీ వెంకటేష్‌నేత, పెద్దపల్లి, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, చింతల రామచంద్రా రెడ్డి, నాయకులు పల్లె సదానందం, కందుల సంధ్యారాణి, ఠాకూర్ రాంసింగ్, పర్శ సమ్మయ్య, బెజ్జంకి దిలీప్‌కుమార్, శివంగారి సతీష్, నర్సింగం, జంగా చక్రధర్ రెడ్డి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సంజయ్

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న మహిళ మెడలోని చైన్‌ను కిటికీ నుంచి అపహరించిన దొంగను 12గంటల వ్యవధిలోనే రామకృష్ణాపూర్ పోలీసులు ఛేదించి పట్టుకున్నారు. ఆదివారం రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్ బెల్లం పల్లి ఏసీపీ రవికుమార్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ఇరుముల్ల శరణ్య కిటికీ పక్కన నిద్రిస్తున్న సమయంలో మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు, అదేవిధంగా బుర్ర రాజేంద్రప్రసాద్ అనేవ్యక్తి మొబైల్ ఫోన్‌ను కిటికీలో నుంచి అపహరించి పారిపోయాడు. సంఘటనపై బాధితులు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలను పరీక్షించగా నిందితుడు గుంజ ఇమాన్యుల్‌గా తేలింది. వెంటనే గోదావరిఖని కాకతీయ కాలనీ పరిసర ప్రాం తాల్లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సింగరేణి ఏరియా ఆసుపత్రి చౌరస్తా వద్ద బైక్‌మీద వెళ్తున్న నిందితుడిని తనిఖీ చేశారు. అతని జేబులో సుమారు మూడుతులాల పుస్తెలతాడు, ఒక మొబైల్‌ఫోన్ దొరకడంతో నిందితుడిని అదుపులోకి తీసు కున్నారు. నేరస్తుడు గుంజ ఇమాన్యుల్ గోదావరిఖని కాకతీయ కాలనీకి చెందినవాడు. గతంలో పలు చోరీ కేసుల్లో అరెస్ట్ అయి ఇటీవల విడుదలయ్యాడు. మళ్లీ దొంగతనం చేస్తూ పోలీసులకు పట్టుబడినట్టు ఏసీపీ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్, క్రైం టీం సిబ్బందికి సీపీ అభినందించి వారికి రివార్డు అందజేశారు.

కారును ఢీకొన్న లారీ

- తొమ్మిది మందికి గాయాలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పొలాస శివారులో ఆదివారం ఎర్టీగా కారును లారీ ఢీకొనడంతో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా దివాల్‌పూర్ గ్రామానికి చెందిన విస్తాపురం భూమేష్, కోడె మధు, శ్రీరాం, మున్నా, ప్రణీత, రిషి, విశ్వనాథ్, నర్సయ్య, మరో వ్యక్తి కారులో ధర్మపురి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి జగిత్యాల వైపు వస్తుండగా లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. క్షతగాత్రుడు కదం శ్రీరాం ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి



సంధ్య (ఫైల్)

హుజూరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కుమ్మరివాడకు చెందిన గన్నారపు సంధ్య (33) అనే అంగన్‌వాడీ టీచర్ అనారోగ్యంతో మృతిచెందింది. సంధ్య కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. సంధ్యమృతిపట్ల సీడీపీవో సుగుణ, సూపర్‌వైజర్లు పద్మ, రాజశ్రీ, శిరీష, రమాదేవి, స్వరూప, జ్యోతి, శ్యామల, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

అప్పుల బాధతో గీత కార్మికుడి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

ఓదెల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఓదెల మండలం పొత్కపల్లికి చెందిన సూదగోని తిరుపతి గౌడ్ (50) అనే గీత కార్మికుడు శనివారం రాత్రి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం పొత్కపల్లికి చెందిన తిరుపతి గౌడ్ ఏడేళ్ల క్రితం హైదరాబాద్ వెళ్ళి ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. కూతురు వివాహానికి అప్పులు చేసి తిరిగి చెల్లించలేక మానసిక ఇబ్బందులతో మనస్తాపం చెంది పొత్కపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రమాదేవి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలంలో ట్రాక్టర్ ఢీకొని రైతు మృతి



రాజిరెడ్డి(ఫైల్)

ఓదెల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లిలో ఆదివారం వరిపంట కోయించేందుకు వెళ్లిన ఎడవెల్లి రాజిరెడ్డి(80) అనేరైతు ట్రాక్టర్‌ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. వరిపంటను హార్వెస్టర్‌తో కోయించేందుకు వెళ్లగా డ్రైవింగ్‌లో అనుభవంలేని వ్యక్తిట్రాక్టర్‌ను వెనకకు తీయడంతో రాజిరెడ్డి ట్రాక్టర్ కిందపడి నలిగి మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై రమేష్ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. మృతుడికిభార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఎస్ఐ రమేష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

- భువనగిరి జిల్లాలో ఘటన
- మృతుడు మామిడిపల్లివాసిగా గుర్తింపు

కోనరావుపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన మండలంలోని మామిడిపల్లికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని పొడిచేడు గ్రామంలో మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పొడిచేడు గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి(40) కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలోనే భార్యాపిల్లలను వదిలేసి ఎక్కడికి పడితే అక్కడికి వెళ్లడం అలవాటుగా మారింది. అదేక్రమంలో శనివారం రాత్రి పొడిచేడు వద్ద బస్సు దిగి బస్‌స్టాప్‌లో పడుకున్నాడు. అపరిచిత వ్యక్తి బస్ షెల్టర్‌లో తచ్చాడుతున్న విషయాన్ని గమనించి ఆరా తీయగా మద్యం మత్తులో ఉన్న వ్యక్తి సరైన సమాధానాలు చెప్పలేదు. ఉదయం గ్రామస్థులు అతడి దగ్గరకు వెళ్లి చూడగా చనిపోయినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వచ్చి అతని సెల్‌ఫోన్ ద్వారా అతనికి సంబంధించిన సమాచారాన్ని వాకబు చేశారు. భార్య, బంధువుల కోరిక మేరకు మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోత్కూర్ పోలీసులు తెలిపారు.

కర్రలే విద్యుత్ స్తంభాలు



మారేడుపల్లిలో కర్రలపై విద్యుత్ తీగలు

ఎండపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలంలోని మారేడుపల్లి గ్రామంలో కర్రలే విద్యుత్ స్తంభాలుగా మారాయి. ప్రమాదమని తెలిసినా విద్యుత్అధికారులు పట్టించుకోవడం లేదు. ఈదురుగాలులకు కర్రలు కింద పడే అవకాశం ఉంది. కోత సమయం లో, పొలం నాటు సమయంలో దీనివల్ల ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్ క్లస్టర్ సర్వీస్ క్యాంపులు

భగత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఆధ్వర్యంలో మంగళవారం క్లస్టర్ సర్వీస్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) పొన్నం అజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్లకు వారి సమస్యలపై తక్షణమే పరిష్కారాన్ని చూపిస్తామన్నారు. మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో టెలిఫోన్ భవన్ కరీంనగర్, టెలిఫోన్ ఎక్చేంజి జగిత్యాల, టెలిఫోన్ ఎక్చేంజి హుజూరాబాద్, టెలిఫోన్ఎక్చేంజి గోదావరిఖనిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు సర్వీస్ క్యాంపులు ఉంటాయన్నారు. ఈఅవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకుని సంస్థకు విలువైన అభిప్రాయాలు అందించి మెరుగైన సేవలకు తోడ్పడాలని కోరారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లో కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన వరి, మామిడి పంటలకు తీరనినష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం పూర్తిగా తడిచిపోయిందని తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న మామిడికాయలు రాలి రైతులకు పెనునష్టం వాటిల్లిందన్నారు. ఒక్క కోరుట్ల నియోజకవర్గంలోనే 12వేల ఎకరాల్లో వరి, మామిడి, మొక్కజొన్న, నువ్వులు, సజ్జపంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో 6వేలఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. అలాగే జగిత్యాల జిల్లాలోని మిగతా మండలాల్లోనూ పంట నష్టంవాటిల్లిందని, అకాల వర్షాలు, ఈదురు గాలులకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



పారాహుషార్

- వేసవిలో అధికంగా చోరీలు
- ఇంటికి తాళం కనపడితే దొంగతనం
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులంటే పిల్లలతోపాటు తల్లిదండ్రులకు కొంత వెసులు బాటు. స్వగ్రామాలకు వెళ్లడంతోపాటు విహార యాత్రలు, పుణ్యక్షేత్రాల సందర్శనకు వేసవి సెలవు ల్లోనే అవకాశం లభిస్తుంది. ఇదే అదనుగా భావించి దొంగలు ఎక్కువగా చోరీలకు పాల్పడతారు. ఇటీవల కాలంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పదిహేను రోజుల కిందట రెండు రోజుల వ్యవధిలో 12 ఇళ్లలోనూ, ఒక మిర్చియార్డులోనూ చొరబడిన దొంగలు లక్షల రూపాయల సొత్తును లూటీ చేశారు. శంకరపట్నం మండలం లింగాపూర్‌లో తాళాలు పగులగొట్టి ఎనిమిది ఇళ్లలో భారీగా బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదు, బైక్ ఇతర విలు వైన వస్తువులను ఎత్తుకెళ్లారు. ఒకరోజు విరామం ఇచ్చిన దొంగలు మానకొండూర్ మండలం అన్నారం గ్రామంలో నాలుగు ఇళ్లలో చొరబడి బంగారం, వెండి, నగదు, బైక్‌లను చోరీ చేశారు.

తాజాగా నగరంలోని సప్తగిరి కాలనీలో మెస్‌డోర్‌లు మాత్రమే బిగించిన ఒక ఇంటిలో అదనుచూసి భారీగా బంగారం, నగదు దొంగి లించుకుపోయారు. పట్టణాల్లో పగటి పూట రెక్కీ నిర్వహిస్తూ టార్గెట్‌గా చేసుకున్న ఇళ్ల వద్ద పరిసరాలను పూర్తిగా అవగాహన చేసుకుంటున్నారు. అర్ధరాత్రి సమ యాల్లో అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఇళ్లల్లోకి చొర బడి చోరీకి పాల్పడుతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఇళ్లకు తాలం వేసి వ్యవసాయ పనులకు వెళ్లడంతో పగటి పూటనే ఇళ్ల లూటీ చేస్తున్నారు. ఒక వైపు బ్లూకోల్ట్స్ పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగానే మరో వైపు దొంగలు చోరీలకు పాల్పడుతుండడం ఆందోళనకు గురి చేస్తోంది. దొంగతనాలు జరిగిన తరువాత పోలీసులు విచారణ చేపట్టి సీసీ కెమెరాలు, వేలిముద్రల ఆధారంగా దొంగలను అరెస్టు చేస్తున్నా బాధితుల సొమ్ము పూర్తిగా రికవరీ కావడం లేదు. కొన్ని సంఘ టనల్లో దొంగలు వేలి ముద్రలు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు, చేతికి టవల్ కట్టుకొని తలుపులు, బీరువాలు తెరుస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

ప్రజలు కూడా సరైన భద్రతా చర్యలు తీసుకోవడం లేదని, దొంగతనాలను అరికట్టడంలో పోలీసులకు సరైన విధంగా సహకారం అందివ్వడం లేదని పోలీసులు పేర్కొంటున్నారు. దొంగతనాల నియంత్రణకు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలని కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి ఒక ప్రకటనలో కోరారు.



తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవికాలంలో రాత్రిపూట ప్రజలు వీలైనంత వరకు ఇంట్లోనే నిద్రించేలా చూసుకోవాలి.
- ఆరుబయట నిద్రిస్తే ఇంటి ప్రధాన తలుపు, ఇతర కిటికీలు గట్టిగా మూసి ఉన్నాయని, గొళ్లెం వేసి ఉందని నిర్ధారించుకోవాలి.
- నగలు, డబ్బు, ఇతర విలువైన వస్తువులను ఇంటిలో సురక్షితమైన స్థలంలో లేదా లాకర్‌లో ఉంచాలి.
- రాత్రిపూట ఇంటి పరిసరాల్లో లైట్లు వెలుగుతూ ఉండేలా చూసుకోవాలి. ఇంట్లో మనుషులు ఉన్నట్లు ద్వారాల వద్ద చెప్పులు ఉంచాలి.
- చీకటి ప్రదేశాలు దొంగలకు అనువుగా ఉంటాయి. ముఖ్యంగా కదలికలను గుర్తించే సెన్సార్‌లైట్లు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- రాత్రిపూట గేట్లు మూసి ఉన్నాయని నిర్ధారించుకోవాలి.
- ఇంటికి తాళం వేసినట్లు కనిపించకుండా కర్టెన్‌ను చాటుగా ఉంచాలి.
- అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనిస్తే వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలి.
- ఒకే చోట ఎక్కువ మంది గుంపుగా నిద్రపోవడం దొంగలకు సులువుగా ఉంటుంది, వీలైతే వేర్వేరు ప్రదేశాల్లో నిద్రించాలి.
- దొంగతనం జరిగితే, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- ఇరుగుపొరుగు వారితో సత్సంబంధాలు కలిగి ఉండాలి. ఒకరినొకరు సహకారం తీసుకోవాలి. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తేఒకరికొకరు తెలియజేసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దీంతో దొంగలను గుర్తించడం, పట్టుకోవడం సులభమవుతుంది.
- ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వేసవిలో దొంగతనాలను నివారించవచ్చు.

ఆపద్బాంధవుడు..

- రక్తదానంలో ఎల్లారెడ్డిపేట యువకుడి ఆదర్శం
- యాభైసార్లు పూర్తి.. పలువురి ప్రశంసలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో రక్తం లభించక నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోవడాన్ని చూసి ఆ యువకుడు తట్టుకోలేకపోయాడు. రక్తలేమితో బాధపడుతున్న రోగులకు రక్తదానం చేస్తున్నాడు. ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన యువకుడు వంగ గిరిధర్‌రెడ్డి.



రక్తదానం చేస్తున్న గిరిధర్‌రెడ్డి

● పది అవార్డులు..

రక్తలేమి, శస్త్రచికిత్స సమయంలో రక్తం లభించక ప్రాణాలు కోల్పోతున్న వారిని చూసి మండల కేంద్రంలోని వంగ గిరిధర్‌రెడ్డి చలించిపోయాడు. 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లో గాంధీ జయంతిని పురస్కరించుకుని మొదటిసారి రక్తదానం చేశాడు. 2005లో స్థానికంగా సహాయ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పాడు. ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేసి వివిధ స్థాయిల్లో 10 అవార్డులు అందుకున్నాడు. రక్తదానం సేవలను విస్తరింపజేసేందుకు తన సంస్థ ద్వారా యువకులకు అవగాహన కల్పిస్తున్నాడు.

మిత్రులు, బంధువులను ప్రోత్సహిస్తున్నాను..

గిరిధర్‌రెడ్డి

రక్తదానం విషయంలో ప్రతిఒక్కరూ అపోహలు వీడాలి. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడటం మన బాధ్యత. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలి. ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 65 ఏళ్లలోపు రక్తదానం చేయవచ్చు. నా ఆరోగ్యం సహకరించే వరకు రక్తదానం చేస్తా. మిత్రులు, బంధువులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నాను.



సినీ నటుడు పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, సినీ నటుడు చిరంజీవి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గిరిధర్‌రెడ్డి (ఫైల్)

యువకుడి కిడ్నాప్ కలకలం

- రూ.7లక్షలు డిమాండ్
- తండ్రి దగ్గర డబ్బు వసూలుకు కుమారుడి నాటకం?
- సికింద్రాబాద్‌లో పట్టుకున్న పోలీసులు



లక్ష్మీరాజం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కోరుట్లరూరల్ మండలం గుమ్లాపూర్‌లో మందలక్ష్మీరాజం(23) అనే యువకుడి కిడ్నాప్‌కలకలం సృష్టించింది. బాధిత కుటుంబ సభ్యులుతెలిపిన వివరాలప్రకారం.. గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మంద గంగారాజం కుమారుడు మంద లక్ష్మీరాజం ఈనెల 19వ తేదీన తనఫోన్‌తోపాటు తండ్రి ఫోన్‌ను పట్టుకొని ఇంటినుంచి ద్విచక్రవాహనంపై బయటకువెళ్లాడు. ఈక్రమంలో 19న లక్ష్మీరాజం ఫోన్ నుంచి అతడి చిన్నాన్న మంద వెంకటికి తన అన్నకుమారుడిని కిడ్నాప్ చేస్తున్నామని రూ.7 లక్షలు కావాలని డిమాండ్‌చేశారు. ఆ విషయాన్ని వెంకటి తన అన్న గంగారాజంకు చేరవేశాడు. గంగారాజం తనఫోన్ గురించి ఇంట్లో వెతగ్గా దొరక్కపోవడంతోపాటు తన కుమారుడు ఇప్పటివరకు ఇంటికి రాలేదని వెతకడం ప్రారంభించాడు. చివరికి లక్ష్మీరాజం ద్విచక్ర వాహనం కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉండడం గమనించారు. ఆదివారం ఉదయం మరో నంబర్ నుంచి చిన్నాన్న వెంకటికి మరోమారు మెసేజ్ వచ్చింది. ప్రస్తుతం రూ.30వేలు పంపాలని సాయత్రం వరకు మిగతా డబ్బులు జమ చేయాలని లేకుంటే మీ కుమారుడిని చంపివేస్తామని మెసేజ్ చేశారు. దీంతో ఇద్దరు అన్నదమ్ములు మెస్సేజ్ వచ్చిన నంబర్‌కు రూ.30వేలు జమ చేసి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి గంగారాజం, లక్ష్మీరాజం ఫోన్ నంబర్ల లోకేషన్ పరిశీలించగా సికింద్రాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో కోరుట్ల ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకొని విచారణ చేపట్టారు. ఆదివారం రాత్రి లక్ష్మీరాజం ఓలాడ్జిలో ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. కాగా లక్ష్మీరాజం వెంబడి ఎవరూ కిడ్నాపర్లు లేకపోవడంతో తండ్రి వద్ద డబ్బులు వసూలు చేయడానికి కిడ్నాప్ డ్రామా ఆడినట్లుగా తెలుస్తోంది. లక్ష్మీరాజంను పోలీసులు కోరుట్లకు తీసుకువచ్చారు. కిడ్నాప్‌నకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కానున్నాయి.

భక్త జనసంద్రంగా రాజన్న ఆలయం

- స్వామివారి దర్శనానికి రెండు గంటల సమయం



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



గణేష్‌వద్ద పూజలో పాల్గొన్న ఆది శ్రీనివాస్–వనజ దంపతులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయం భక్తజన సంద్రంగా మారింది. ఆదివారం సెలవు రోజు కావడంతో వేములవాడకు భక్తులు భారీగా తరలివచ్చారు. రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఉదయం భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారుగా రెండుగంటలపాటు బారులు తీరారు. శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. అనంతరం రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవోవినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరిండెంట్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాజన్న సేవలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దంపతులు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దంపతులు ఆదివారం దర్శించుకు న్నారు. ఆది శ్రీనివాస్ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్నదర్శనానికి వచ్చారు. ఆలయఅర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

వరి కొయ్యలను కాల్చితే.. నష్టమే



- కాలుష్యం పెరుగుతుంది
- భూమిలోని పోషకాలపై తీవ్ర ప్రభావం
- భూమిలో కలియదున్నితే పంటలకు ఎంతో మేలు

చొప్పదండి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రైతులు.. సాధారణంగా వరి పంట కోసిన తరువాత కొయ్యలను కాల్చివేస్తారు. అలా వరికొయ్యలను కాల్చితే భూమిలోని పోషకాలపై తీవ్రప్రభావం చూపుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. భూమిలోని పోషకాలు తగ్గి దిగుబడి పడిపోయి పంటకు మేలుచేసే పోషకాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం ఆవిరైభవిష్యత్తులో పంటల దిగుబడిపై ప్రభావం చూపుతాయి. వాయుకాలుష్యం వల్ల రైతు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. వరికొయ్యలను కాల్చ కుండా పొలంలోనే కలియ దున్నితే భూ సారం పెరిగి దిగుబడి పెరుగుతుంది. గతంలో రైతులు పంటల అవశేషాలను, చెత్తా చెదారం, పత్తికట్టె, వరి కొయ్యలను తగులబెట్టకుండా భూమిలోనే దున్నేవారు. ప్రస్తుతం వరికోత యంత్రాల ద్వారా కోస్తుండడంతో కొయ్య పొడవుగా ఉండడం చేత మురగడానికి సమయం పడుతుం దని రైతులు కాల్చి వేయడానికే మొగ్గు చూపుతున్నారు. దీంతో ఎరువులు చల్లినా సరైన పంట దిగుబడి రావడం లేదు. రైతులు ఏటా వరి కొయ్యలను తగల బెడుతుండగా వర్యావరణం, వాతావరణంలో మార్పులు వస్తున్నాయి.

వరికొయ్యలకు నిప్పు పెట్టడంతో కలిగే నష్టాలు..

వరికొయ్యలను కాల్చడంతో వాయుకాలుష్యం పెరుగుతుంది. వాతావరణ కాలుష్యం పెరిగి విపరీతమైన వేడితో పంట భూమి సారాన్ని కల్పోతుంది. నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి పంటదిగుబడి తగ్గిపోతుంది. భూమికి పీచుపదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలానికి మేలుచేసే క్రిమికీటకాలు నశించి భూసారం తగ్గిపోతుంది. వానపాములు(ఎర్రలు), అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చనిచెట్లు కూడా ఒక్కోసారి కాలిపోతాయి. అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది.

భూసారం పెంపునకు దోహదం

వరికొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి పంట దిగుబడులు 5నుంచి 10 శాతం పెరిగే అవకాశముంది. నేలలో గడ్డిని కలియదు న్నడం వల్ల సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుం ది. భూసారంతోపాటు దిగుబడులు పెరిగి రైతులకు మేలు జరుగుతుంది. దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి, పోషకాలుగా మారి డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. కొయ్యలను దున్నడం వల్ల ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవు తుంది. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మ దాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి. నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది. కొయ్య కాళ్లను భూమిలో కలియ దున్నితే, గడ్డి ద్వారా పోషకాలన్నీ తిరిగి నేలకు చేరుతాయి.

వరికొయ్యలను కాల్చవద్దు: వంశీకృష్ణ, ఏవో, చొప్పదండి



వరిపంటలో కొయ్యకాలు కాల్చడం వలన భూమిలో ఉన్న పంటకు మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయి. పంటకు అందవల్సిన పోషకాలు అందకుండా నత్రజని, భాస్వరం, పొటాషియం లాంటి పోషకాలు తగ్గి భూమి యొక్క నెల నిర్మాణం చెదిరి పోతుంది. సేంద్రియ కార్బన్ తగ్గిపోయి పంట దిగుబడి తగిపోతుంది. వాయు కాలుష్యం పెరగడంతో వాతావరణంలో మార్పులు వస్తాయి. రైతులు వరికొయ్యలు కాల్చే బదులు రోటరీ మాల్చర్ ద్వారా పొలాన్ని దున్ని, ఎకరానికి 100కిలోల సూపర్ ఫాస్పేట్ చల్లుకోవడం ద్వారా కొయ్యకాలు మురిగి పంట దిగుబడి పెరుగుతుంది.

ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలకు స్పందన

- 250 మంది క్రీడాకారుల హాజరు



హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికల్లో పోటీపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్‌జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లాకేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ మైదానంలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడిజిల్లాలోని వివిధప్రాంతాల నుంచి 250మందిక్రీడాకారులు హాజరయ్యారు. వీరినుంచి సీనియర్ మహిళల ఎంపిక పోటీలతోపాటు సౌత్‌జోన్ పురుషుల, మహిళల ఎంపికపోటీలను కూడా నిర్వహించారు. ఈ ఎంపికపోటీల్లో ప్రతిభచాటిన ఉమ్మడి జిల్లాజట్లకుఎంపికైన క్రీడాకారులు ఈనెల29 నుంచి 30వరకు ఆదిలాబాద్ జిల్లా మంద మర్రిలో జరిగే 54వరాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు. అంతకుముందు కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ యాదగిరి సుజిత్‌రావు ముఖ్య అతిథిగా హాజరైపోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయిపోటీల్లో జిల్లాక్రీడాకారులు విశేష ప్రతిభచాటి చాంపియన్లుగా నిలిచేందుకు కృషిచేయాలన్నారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని, నిత్య జీవితంలో క్రీడలను ఒకభాగంగా చేసుకోవాలని సూచించారు. ఈపోటీలను జిల్లాహ్యాండ్ బాల్‌అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్లవెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో సంఘ సంయుక్తకార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, దాసరి మల్లేష్, పెద్దపల్లి జిల్లా బాధ్యుడు సురేందర్, సిరిసిల్ల జిల్లాబాధ్యుడు కృష్ణహరి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, తిరుమలేష్, విజయ్, సూర్య, అమర్‌సాయి, శివాజీ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరి సీతారామరాజుతండాకు చెందిన జరుపుల హరిప్రసాద్(12) అనే విద్యార్థి ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని జరుపుల దేవేందర్, సుజాత దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. హరిప్రసాద్ పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఆరవ తరగతి చదువు తున్నాడు. ఈనెల 17న వార్షిక పరీక్షలు పూర్తి కావడంతో కొడుకును ఇంటికి తీసుకు రావడానికి తండ్రి దేవేందర్ గురుకుల పాఠశాలకు వెళ్లగా కడుపు నొప్పిగా ఉందని హరిప్రసాద్ తెలిపారు. దీంతో కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించు కుని అదే రోజు ఇంటికి తీసుకొచ్చాడు. ఆదివారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్న హరిప్రసాద్ కళ్ళు తిరిగి కింద పడిపోయాడు. గమనించి కుటుంబ సభ్యులు వెంటనే మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి హరిప్రసాద్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. హరిప్రసాత్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడిని పెట్టించింది.

'నలంద'లో ఫేర్‌వెల్ డే

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నలంద డిగ్రీ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసుకోబోతున్న విద్యార్థులు ఘనంగా ఫేర్‌వెల్ డే మరియు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసుకోబోతున్న విద్యార్థులను అభినందిస్తూ, ప్రస్తుతం పూర్తి చేయబోతున్న డిగ్రీ ద్వారా ఐఏఎస్, ఐపీఎస్ పరీక్షలు రాయడానికి అర్హత సాధించారని, ఈ అర్హతతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. టాస్క్ ద్వారా విప్రో కంపెనీలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు, యూనివర్సిటీ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సైతం జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

సారంగాపూర్, ఎప్రిల్, 20 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రేచపల్లి అటవీ ప్రాంతంలో నూతనంగా ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి హజరై ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోండ్ర రాంచందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లావణ్య, సీనియర్ నాయకులు ప్రసాద్ గౌడ్, ఆసాది రాజన్న, నిర్సింహరెడ్డి, ఎడమల శ్రీనివాస్, సంజీవరెడ్డి, ఆసాది హరీష్, బేర మహేష్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మల్లాపూర్, ఏప్రిల్, 20 (ఆంధ్రజ్యోతి): ముత్యంపేట శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయలంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అనంతరం శోభయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ముదిరాజ్‌లు, గ్రామాభివృద్ధి, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీరేదెన్నడో..?

-రంగరావుపేటలో మూడు రోజులుగా నిలిచిన సరఫరా -తరచుగా లీకవుతున్న పైప్‌లైన్ -పట్టించుకోని అధికారులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి రూరల్ మండలం రంగరావుపేటలో గ్రామంలో మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారులోని భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచి పోయింది. ప్రతి సంవత్సరం గ్రామంలో నీటి సమస్య ఉంటుంది. పంచాయతీ కార్యదర్శి, మిషన్ భగీరథ అధికారులు లీకేజీపై నిర్లక్ష్యం చేయడం వలన గ్రామానికి మూడు రోజులకు ఒక్కసారి నీటి సరఫరా నిలిచిపోతుంది. దీంతో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీ ఎదుట ఉన్న బోరు పంపు వద్ద నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు.


బోరు బావి నుంచి నీటిని తీసుకెళ్తున్న గ్రామస్థులు

●గ్రామస్థుల ఇక్కట్లు

మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాగడా నికి, ఇంటి అవసరాలకు, బట్టలు ఉతకాలంటే గ్రామ పంచాయతీ వద్ద ఉన్న బోరు పంపు వద్దకు వెళ్లాల్సిందే. ఇంటి నుంచి బట్టలు తీసుకొని పంచాయతీ వద్ద ఉతుక్కోవాలంటే అసౌకర్యానికి గురవుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యలు ఉన్న గ్రామాల్లో పంచాయతీ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని జిల్లా స్థాయి అధికారులు వేసవి ప్రారంభానికి ముందే సూచనలు చేశారు. గ్రామానికి వచ్చే మిషన్ భగీరథ నీటి పైప్ లైన్ మూడు రోజుల వ్యవధిలోనే రెండు సార్లు లీకవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్నారు. పంచాయతీ కార్యదర్శి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కార్యదర్శిని వివరణ అడగ్గా అంతగా సమస్య లేదని తెలిపాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడల శిక్షణ

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న (సమ్మర్ కోచింగ్) వేసవి క్రీడ శిక్షణ శిబిరం నిర్వహించబడుతుందని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు. చిన్నతనం నుంచి క్రీడారంగం పట్ల ఆసక్తిని పెంచేలా తయారు చేయడంతో పాటు, ఆటలంటే ఇష్టంగా చెయ్యాలన్నదే తమ సంస్థ లక్ష్యం అన్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగిత్యాల జిల్లాలో మెట్‌పెల్లి మినీ స్టేడియంలో మర్రిపెల్లి కార్తీక్-9959523772, కోరుట్ల మినీ స్టేడియంలో సీహెచ్ శంకర్-9985587043, మల్యాల మండలం అంజయ్య-8341037156, ఎండపల్లి మండలంలో కొము రయ్య-9652138220, మల్యాల మండలం తక్కళ్లపల్లిలో గంగ సాగర్-9000365409, మెట్‌పల్లిటౌన్, ప్రశాంత్-7702435762, బీర్‌పూర్ మండలం అంజయ్య -9963382220, బుగ్గారం మండలం సిరికొండలో ప్రశాంత్-9618757757, మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో నాగరాజు-9346378523, రాయికల్ మండలం కట్కా పూర్‌లో మహేష్-8074545019, జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో శ్రీకాంత్‌రెడ్డి-9550963101, ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భానేష్-6305534658 నెంబర్‌లకు ప్రాంతాల వారీగా సంప్రదించాలని కోరారు. ఏప్రిల్ 25 నుంచి 24వరకు ఉదయం 6గంటల నుంచి 7:30గంటల వరకు, సాయంత్రం 5:30 గంటల నుంచి 7గంటల వరకు ఈ క్రీడలు నిర్వహించబడునని పోషకులు గమనించి తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తూ, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయికల్‌వాసికి డాక్టరేట్

రాయికల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన కాయితి శంకర్ డాక్టరేట్‌కు ఎంపికయ్యాడు. లండన్‌లోని మెక్సికో టొలాసా యూని వర్సిటీ అధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. శంకర్ పాత్రికేయుడిగా, అంబేద్కర్‌వాదిగా సమాజంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలను చైతన్యం చేసేందుకు రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారు. జగిత్యాల జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అనేక పోరాటాలు చేసినందుకుగాను ఈ అవార్డు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ అవార్డును మహారాష్ట్రలోని నాసిక్‌లో ఏప్రిల్ 27న ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్‌ను సమతా సైనిక్ దళ్ నాయకులు మెట్టు దాస్, ఉయ్యాల శోభన్, కోట శంకర్, సేందర్, అంబేద్కర్ సంఘం నాయకులు చెంగలి గంగాధర, బాపురపు నర్సయ్య, గుర్రం రత్నాకర్, చింతకుంట సాయి కుమార్ తదితరులు అభినందించారు.

ట్రస్మా కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణ ట్రస్మా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీదర్ రావు ఆదివారం తెలిపారు. పట్టణ అధ్యక్షుడుగా ఎంఏ బారీ, ప్రధాన కార్యదర్శిగా గుజ్జెటి వెంకటేష్, కోశాధికారిగా దీపక్‌లను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. నూతనంగా ఎంపికయిన సభ్యులను సంఘ సభ్యులు పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు బోగ రవిప్రసాద్, సభ్యులు తుమ్మనపల్లి సత్య నారాయణ, చౌకి రమేష్, కూడేలు రాజేంద్ర ప్రసాద్, బండి మహాదేవ్, పిన్నంశెట్టి శ్రీదర్, దామోదర్, సిదార్థ, కైజర్, పోతని ప్రవీన్ కుమార్, రాజేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, ఏప్రిల్, 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండలంలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 49 మందికి స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ముందుగా గొర్రెపల్లి గ్రామా శివారులోని శ్రీలక్ష్మివెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పథకాలను ప్రవేశపెట్టి అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జలపతిరెడ్డి, నల్ల రాజన్న, బాపురెడ్డి, ఆనంద్‌గౌడ్, రవీందర్, రమేష్, శ్రీనివాస్, మార్కెట్ కమిటీ పాలక వర్గం, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న నర్సింగరావు

●ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల అభివృద్ధికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. మండలంలోని 40 మంది లబ్ధిదారులకు రూ. 14,25,000 విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ రావు మాట్లాడారు. వైద్య చికిత్స పొందిన నిరుపేదలకు సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మెన్ బోరిగం రాజు, వైస్ చైర్మెన్ ఎల్లాల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడ శ్రీకాంత్ రెడ్డి, గంగాధర్, బండి రాజేష్, గంగాధర్, రావల గణేస్, బండి రాజేష్, నల్ల రమేష్, బూస రాజేశ్వర్, నల్ల రామరాజు, బాస్కర్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వస్తున్నాయి..

(5వ పేజీ తరువాయి)

పంపిణీ చేయనున్నారు. జూన్ తొలి వారంలో పాఠశాలల పునః ప్రారంభం లోపు కొత్త పుస్తకాలు వారికి అందిచేలా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

● అరకొరగా వస్తే సమస్యలే

పూర్తి స్థాయిలో పుస్తకాల సరఫరా కాకుండా అరకొరగా వస్తే సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయి. గత యేడాది పుస్తకాలు ముందుగానే వచ్చినప్పటికీ కొన్ని తరగులు, సబ్జెక్టులకు సంబందించి సరఫరా కాలేదు. ప్రధానంగా ఇంగ్లీష్ మీడియం పుస్తకాలు రాలేదు. హిందీ పాఠ్య పుస్తకాలు కొరత నెలకొంది. దీంతో చదువుకునేందుకు ఉన్నత తరగతుల విద్యార్థులు ఇబ్బందుల పాలయ్యారు. ప్రస్తుత విద్యాసంవత్సరమైనా పుస్తకాలు పూర్తి స్థాయిలో అందేలా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసర ముంది. పాఠశాలలు తెరిచే సమయానికి పాఠ్యపుస్తకాలను అరకొరగా పంపి ణీ చేస్తుండడం వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. పాఠశాలలను ప్రారంభించే సమయా నికి విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సకాలంలో పుస్తకాలు అందిస్తాం

-ద్రోణంరాజు వెంకట రామకృష్ణ, డిస్ట్రిక్ట్ నోట్ బుక్ మేనేజర్



వచ్చే విద్యా సంవత్సరానికి ఉచిత పాఠ్య పుస్తకా లను విద్యార్థులకు సకాలంలో అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా కేంద్రానికి వచ్చిన పుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు అందించి పాఠ శాలలు తెరిచే సమయానికి విద్యార్థులకు సరఫరా చేస్తాం. జిల్లా కేంద్రం నుంచి మండలాలకు అక్కడి నుంచి పాఠశాలలకు అవసరమైన సంఖ్యలో పుస్తకాలను అందజేస్తాం.

ఇబ్బందులు లేకుండా చూడాలి..

-దొనికెల నవీన్, రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు



జిల్లాలో రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ జరపాలి. ప్రభుత్వం పాఠ్య పుస్తకాల సరఫరాలో జాప్యం జరగకుండా చూడాలి. విద్యార్థులకు అవసరమైన పుస్త కాల సరఫరాపై దృష్టి సారించాలి. సకాలంలో పుస్తకాలు అందితేనే బోధన సక్రమంగా జరుగుతుంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

-అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన ఐఐటీ-జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబరచడం అభినందనీయమని అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలోని అల్ఫోర్స్ ఐఐటీ అకాడమిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు ఆయన హాజరయ్యారు. జేఈఈ మెయిన్ ఫలితాల్లో ప్రతిభ కనబరచిన అంకిత్ సాయి 99.81 శాతం, గోపిక హర్షిత 97.41 శాతం, సాకేత్ 94.25 శాతం, వర్షిత్ 93.07 శాతం, గ్రాడిస్ 80.97 శాతం, లహరిక 85.64 శాతం, శివాని 84.05 శాతం, భార్గవి 84.05 శాతం మార్కులు సాధించగా అభినం దించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను అల్ఫోర్స్ విద్యార్థులు ప్రదర్శిం చడం సంతోషకరమన్నారు. జాతీయ స్థాయిలో మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేసిన అధ్యాపకులు, తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందించడమే లక్ష్యంగా అల్ఫోర్స్ విద్యా సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ అల్ఫోర్స్ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

కోరుట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం టీడీపీ శ్రేణులు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గజల్, రాజు, గణేష్, సాదుల్లా, ఈర్నాల గంగులు, నర్సింగరావు, బాల్య మారుతి, మాదవరెడ్డి, చిప్ప శేఖర్, సామర్ల రాజలింగంలు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి టౌన్: మెట్‌పల్లి పట్టణంలో ఆదివారం కోరుట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజల్ రాజ, గణేష్, సాదుల్లా, ఈర్నాల గంగులు, నర్సింగా రావు, చందు, బాల్య మారుతి, మాధవ రెడ్డి, చిప్ప శేఖర్, సామర్ల రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

●ధర్మపురి: ధర్మపురి మండల కేంద్రంలో నంది విగ్రహ చౌరస్తా వద్ద టీడీపీ నేత ఉప్పుల రామకిష్టయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పుల రామకిష్టయ్య, ఒజ్జల పుల్లయ్యశాస్త్రి, దూడ జయపాల్, జిల్లపెల్లి వీరయ్య, తిరుమన్‌దాసు శ్రీనివాస్, నస్పూరి కిషన్ పాల్గొన్నారు.

●మల్లాపూర్: తెలుగుదేశం పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి మానుక ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మల్లాపూర్ నివేదిత వృద్ధుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలు

●ధర్మపురి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, మాజీ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మొగిలి శేఖర్, పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్ పాల్గొన్నారు.

●వెల్గటూర్: వెల్గటూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చల్లూరి రాంచంద్రం గౌడ్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, మూగల సత్యం, కూనమల్ల లింగయ్య పాల్గొన్నారు.

●పెగడపల్లి : పెగడపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు లోక మల్లారెడ్డి, నాయకులు ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, రాజశేఖర్ గౌడ్ , కరుణాకర్ రావు తాటిపాముల రాజు పాల్గొన్నారు.

●ఎండపల్లి : ఎండపల్లిలో మండల అధ్యక్షులు సింహాచలం జగన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

'దేవాలయాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం'

కోరుట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కాంగ్రెస్ నియోజవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావు అన్నారు. అదివారం పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయ ధర్మకర్తల మండల ప్రమాణ స్వీకారంలో జగిత్యాల జిల్లా దేవాలయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి ఆధ్వర్యంలో నిర్వహించగా జువ్వాడి నర్సింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మకర్తలు ప్రత్యేక సమేవేశం ఏర్పాటు చేసుకొని చైర్మన్‌గా ఎతిరాజం నర్సయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మెన్ ఎతిరాజం నర్సయ్యతో పాటు ధర్మకర్తలుగా నేతి శ్రీనివాస్, కట్కం దివాకర్, కొట గంగాధర్, గోడికే రాములు, చిలువేరి విజయ్‌కుమార్, చిట్యాల పద్మ, ఎక్స్ అఫిషియా మెంబర్‌గా బీర్నంది నరసింహచారిలతో ప్రమాణ స్వీకరంను దేవాలయ శాఖ అధికారులు చేయించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈఓ విక్రం, సిబ్బంది పెడిపల్లి నర్సయ్య, సింగిల్ విండో చైర్మెన్ ఎలిశెట్టి భూమారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ శీలం వేణుగోపాల్, నాయకులు అన్నం అనిల్ కుమార్ తిరుమల గంగాధర్, కొంతం రాజం, అన్నం అనిల్ కుమార్, పుప్పల ప్రభాకర్, మచ్చ కవిత పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పక్కా భవనం కలేనా..?

●స్థలం కేటాయించినా నిధుల విడుదలలో జాప్యం ● ఇబ్బందులు పడుతున్న పాఠకులు

కథలాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పాఠకులకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఎన్నిసార్లు సంబంధిత అధికా రులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని పాఠకులు వాపో తున్నారు. వానాకాలం భవనం ఊరుస్తున్న నేపథ్యంలో తరచూ పెచ్చులూడి పడుతున్న పరిస్థితి కథలాపూర్ మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి దాపురించింది.



శిథిలమైన భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

●30 సంవత్సరాలుగా మండల కేంద్రంలో గ్రంథాలయం కొనసాగుతోంది. బస్టాండ్ సమీపంలోని ఓ గదిలో కొంతకాలం కొనసాగగా అక్కడి నుంచి ప్రస్తుతం ఉన్న భవనంలోకి మార్చారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని వానాకాలంలో ఊరుస్తుంది. పెచ్చులూడి పాఠకులు, సిబ్బందిపై పడ్డ సందర్భాలు ఉన్నాయి. గ్రంథాలయంలో ఉన్న కథల పుస్తకాలు, నవలలు, వీక్లీలు తడిస్తున్న పరిస్థితి ఉంది. వివిధ పోటీ పరీక్షల కోసం సన్నద్ధమయ్యే యువత ఈ గ్రంథాలయానికి వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. ఎన్నో సార్లు పాఠకులు ప్రజాప్రతినిధులకు పక్కా భవనం నిర్మించాలని వినతి పత్రాలు అందజేశారు. అయితే ప్రభుత్వ భూమి కేటాయించకపోవడంతో కొన్నేళ్ల పాటు కాలయాపన జరిగింది. మూడు మాసాల కిందట మూడు గుంటల భూమి కేటాయిస్తూ రెవెన్యూ శాఖ గ్రంథాలయ శాఖ అధికారులకు అప్పగించారు. కానీ నేటికీ పక్కా భవనానికి నిధుల కేటాయింపు జరగకపోవడం పట్ల పాఠకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లైబ్రేరియన్ కూడా ఇన్‌చార్జిగా కొనసాగుతుండగా ఆఫీస్ సబార్డినేట్‌తో గ్రంథాలయం కొనసాగిస్తున్నారు. దినపత్రికలు చదవడానికి మినహా పోటీ పరీక్షార్థులు ఇక్కడికి రావడం లేదు.

●ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

కవిత, ఇన్‌చార్జి లైబ్రేరియన్



రాయికల్, కథ లాపూర్, వెల్గటూర్ మండ లాల్లో నూతన గ్రంథా లయాల నిర్మాణానికి అధికారులు ప్రయ త్నాలు చేస్తున్నారు. ఈ బడ్జెట్‌లో కథ లాపూర్‌కు నిధులు రానున్నాయి. పుస్తకాలు కావాలనే విద్యార్థులు, యువత తమను సంప్రదిస్తే వారికి తెప్పించే ఏర్పాట్లు చేస్తాం. పక్కా భవనం నిర్మిస్తే పాఠకుల అవస్థలు తీరుతాయి.

బీజేపీ నాయకులపై విమర్శలు గర్హనీయం

పెగడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ నాయకులపై పీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం విమర్శించారు. ఆదివారం ఆయన పెగడపల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. హిందూ సంప్రదాయం ప్రకారం ఎవరు ఎవరిని పెళ్లి చేసుకున్నా భర్త కులమే వర్తిస్తుందని కాంగ్రెస్ నాయకులే చెప్పారన్నారు. అలాంటప్పుడు ఇందిరాగాంధీ ముస్లిం మతానికి చెందిన ఫిరోజ్ ఖాన్‌ను పెళ్లి చేసుకుంటే వారికి పుట్టిన పిల్లలు ఏ మతానికి, ఏకులానికి చెందినవారు అవుతారో చెప్పాలన్నారు. ఫిరోజ్‌ఖాన్ సంతానం అయిన రాజీవ్ క్రిస్టియన్ మతానికి చెందిన సోనియాను పెళ్లాడితే వారి సంతానం అయిన రాహుల్, ప్రియాంకలు ఏ మతానికి చెందిన వారు అవుతారో తెలియకుండా పిచ్చి కూతలు కూస్తున్న కాంగ్రెస్ నాయకులను ఆసుపత్రిలో చేర్పించాలని సత్యం అన్నారు. తెలంగాణ ఇచ్చింది సోనియా అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులకు జై భీమ్, జై సంవిధాన్ అని ఉచ్చరించే అర్హత లేదన్నారు. ఇందిరా ప్రియదర్శిని నుండి మొదలుకొని నేటి రాహుల్ వరకు గాంధీ పేరు చెప్పుకుని నకిలీ గాంధీలు తయారు అయ్యారని విమర్శించారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం


చలో వరంగల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న లక్ష్మీనరసింహారావు

కథలాపూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) స్వరాష్ట్ర సిద్ధి కోసం 15 ఏళ్ళు పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణలో పచ్చని పంటలు పండడానికి కారణం బీఆర్ఎస్ పార్టీయేనని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సారార్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న ఛలో వరంగల్ సభకు సంబంధించి సన్నాహక సమావేశంకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గడిచిన పదేళ్ళ కాలంలో అతి చిన్న రాష్ట్రమైన తెలంగాణను అత్యంత వేగంగా అభివృద్ధి చేసి దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చి దిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో కరువు విలయతాండవం చేయగా బీఆర్ఎస్ హయాంలో దేశంకే అన్నం పెట్టే అన్నపూర్ణగా మారిందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు గత 16 మాసాల్లో చేసింది శూన్యమని పాలనా తీరు వల్ల రియల్ ఏస్టేట్ రంగం కుదేలై ఆదాయం భారీగా తగ్గిపోయిందన్నారు.

రాష్ట్రానికి గుండెకాయలాంటి మిడ్ మానేరును అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అర్థాంతరంగా పనులను వదిలేస్తే కేసీఆర్ రు.1500 కోట్లు వెచ్చించి ఆ నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగించేలా చేశారని గుర్తు చేశారు. వరంగల్ సభకు అధికంగా జన సమీకరణ చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ గంద్ర కిరణ్‌రావు, మాజీ ఎంపీటీసీ రవి, మాజీ సర్పంచ్ చీటి విద్యాసాగర్‌రావు, దొప్పల జలంధర్, గడ్డం భూమారెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పట్టణ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ) ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కార్యనిర్వహణ అధికారులు ముత్యాల రమేష్, అదిల్ పాషా, అఫ్రోజ్‌లు తెలిపారు. అధ్యక్షుడిగా బూరం సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ అజీం, ఉపాధ్యక్షులుగా జంగా విజయ్, సాజిద్‌పాషా, కోశాధికారిగా ఎస్‌కే మక్సూద్, సహాయ కార్యదర్శులుగా పింజరి శివ, పి.శశికాంత్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎండీ సమియొద్దిన్, కార్యవర్గ సభ్యులుగా ముత్యాల రమేష్, మహ్మద్ అఫ్రోజ్, షేక్ రఫీ, ఉల్లా సిరికొండ సాగర్, పావనిగంటి మహేందర్, బాసెట్టి హరీష్, కుర్ర రాజేందర్, యాసం రాకేష్‌కుమార్, యస్‌డి సోహెల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

పంట నష్టం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 20 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా కృషి చేస్తానని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. ఆదివారం మండలంలోని మేడిపల్లి తోపాటు పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి రైతులకు భరోసా కల్పిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుండెల నగేష్, నాయకులు కల్లెడ గంగాధర్, రాజేష్, శ్రీనివాస్, రమేష్, చిన్నరాజరెడ్డి, మనోజ్‌కుమార్, కుతుబ్‌పాషా, కోరె రాజుకుమార్ పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

రాయికల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రాథమిక, ఉన్నత పాఠ శాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్ర మంలో మాజీ సర్పంచులు వాసవి రవి, బెజ్జంకి మోహన్, మాజీ ఉప సర్పంచ్ జకిలేటి హరీష్ రావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు లక్ష్మి, రాజేశ్వరి, ప్రాథ మిక పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు హేమలత పాల్గొన్నారు.